నవతెలంగాణ
ఆదిలాబాద్
1
బుధవారం | అక్టోబర్ 23, 2024 | www.navatelangana.com

మందుల కొరత లేకుండా చూస్తాం

- ఆయుష్ డిపార్ట్‌మెంట్ అదనపు సంచాలకులు పమేశ్వర్ నాయక్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రులలో మందుల కొరత లేకుండా చూస్తామని ఆయుష్ అదనపు సంచాలకులు పరమేశ్వర్ నాయక్ తెలిపారు. మంగళవారం జనరల్ ఆస్పత్రిలోని మొదటి అంతస్తులోని ఆయుష్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. రానున్న రోజుల్లో రోగులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం ఆయనను ఆస్పత్రి సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ఫార్మసిస్ట్ దేవర ఫణిందర్, డీపీఎం శ్రావణ్ కుమార్, డీఈఓ నవీన్ ఉన్నారు.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్



ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని యాకరపల్లి గ్రామంలో 4 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న గ్రామమైన యాకరపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికల సమయంలో ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, రమణ, వర్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలకనిలో సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు



నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌లోని జర్నలిస్ట్ కాలనీలో సౌకర్యాలు కల్పించాలని, ముధోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు షఫీఉల్లాఖాన్ ఆధ్వర్యంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మా కాలనీలో ముఖ్యంగా జనరల్ కమ్యునిటీ హాల్, ప్రహరీ గోడకు నిధులు కేటాయించాలని జర్నలిస్టులు కోరారు. కాలనీ గుట్ట ప్రాంతం కావటంతో కాలనీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని వారు కోరారు. అలాగే ఏదైనా కార్యక్రమం నిర్వహించటానికి కమ్యునిటీ హాల్ కూడా అవసరమని జర్నలిస్టులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాలనీలో ముందుగా సీసీ రోడ్డు మంజూరు చేస్తామని, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మార్పును సృష్టించాలి

- కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన ఈనెల 18, 19, 20 తేదీల్లో ఢిల్లీలోని జవహర్ భవన్‌లో జరిగిన శక్తి అభియాన్ జాతీయ కార్యవర్గ సమావేశం విజయవంతంగా పూర్తయిందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జీ, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యూనిట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ తెలిపారు. 27 డిసెంబర్ 2023 నేడే ఇందిరా ఫెలోషిప్‌లో చేరానని, మొదటి సారిగా మహిళలకు పార్లమెంట్ సీటు ఇవడం, అందులో నాకే మంచి అవకాశం దొరికిందని అన్నారు. మహిళలో కూడా తేడాలు ఉన్నాయని, తేడాలను వదిలేసి ఐక్యంగా ఉండి ముందుకు రావాలని కోరారు. తనను తాను కాపాడుకునే దిశగా ఉండాలని, మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంద్ర షిప్‌లో చేరాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు సాధికారత కల్పించడం, రాజకీయాల్లో వారికి సరైన ప్రాతినిధ్యం కల్పించడం, సమానత్వం, మార్పు వైపు మార్గం సుగమం చేయడం లక్ష్యంగా భారతీయ యువజన కాంగ్రెస్ నేతృత్వంలోని శక్తి అభియాన్ ఇందిరా ఫెలోషిప్ పని చేస్తుందని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలను బలోపేతం చేయటం కోసమే ఏడాది క్రితం రాహుల్ గాంధీ శక్తి అభియాన్ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 25 శక్తి అభియాన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, రాబోవు రోజుల్లో గ్రామ గ్రామాన కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో త్వరలో శక్తి అభియాన్ దేశస్థాయి సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి రాహుల్ గాంధీని ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు బండారి కవిత, రాజమ్మ, ఆశమ్మ కమల పాల్గొన్నారు.

వీసీని కలిసిన అధ్యాపక సంఘం నాయకులు



నవతెలంగాణ-ముధోల్

ఆర్జీయూకేటీ బాసరకు నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ గోవర్ధన్ ఆర్జీయూకేటీ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం కలిశారు. గ్రామీణ పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలన్న ఉద్దేశంతో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయానికి సాంకేతిక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన, పరిపాలన అనుభవం, సమర్థత కలిగిన ప్రొఫెసర్ గోవర్ధన్‌ను ప్రభుత్వం వీసీగా నియమించడం ఎంతో సంతోషకరమని సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడారు. బాసర ట్రిపుల్ ఐటీ స్థాపించినప్పటి నుంచి పనిచేస్తున్న అధ్యాపకులు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సహాయ సహకారాలు అందించాలని వీసీ సూచించారు. సమన్వయంతో పని చేస్తే పురోగతి సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసీని అధ్యాపక సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ ఎంప్లాయ్ అసోసియేషన్ మాస్టర్ అధ్యక్షులు శ్రీశైలం, జనరల్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్, సహకార దర్శులు సతీష్ కుమార్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ ఎస్.విజయ్ కుమార్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ రాములు, వసంత్ బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మాదిగల అంబేద్కర్ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులుగా అడ్డిగా లక్ష్మణ్ ఎన్నికైన శుభ సందర్భంగా మంగళవారం నిర్మల్ పట్టణ ఐబీలో టీడీఆర్డీఓ, స్పందన, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మారాపాక నరేష్, సట్టి సాయన్న, కత్తి విష్ణు, ఇసాక్ అలీ, నిగులపు లింగన్నలు ఉన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థుల మిస్సింగ్

- ఆందోళన చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు
- చివరకు పల్సితండాలో దొరికిన విద్యార్థులు



నవతెలంగాణ-భైంసా

భైంసా పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 8వ తరగతికి చెందిన చరణ్, రాకేష్ 6వ తరగతికి చెందిన కేశవ్, 5వ తరగతికి చెందిన ఈశ్వర్ అనే 4 గురు విద్యార్థులు మిస్సింగ్ అయిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకోగా, ఇది తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తల్లి తండ్రులకి సమాచారం ఇవ్వడంలో హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ నిర్లక్ష్యం వహించారంటూ తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థుల మధ్య నిన్న రాత్రి గొడువ జరిగినట్టు అక్కడి మరో విద్యార్థి పేర్కొన్నారు. ఏప్పటిలాగే రోజు ప్రొద్దున పిల్లలకి పాలను పంచే క్రమంలో వాచ్‌మెన్ గమనించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సంఘటన స్థలానికి పట్టణ సీఐ గోపీనాథ్ చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి, హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ ద్వారా మరింత సమాచారాన్ని సేకరించారు. విద్యార్థుల ఆచూకీ కోసం పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. చివరకు విద్యార్థులు కుభీర్ మండలంలోని పల్సితండాలో ప్రత్యక్ష మవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన సీఈఓ



నవతెలంగాణ-కుభీర్

ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన జెడ్పీ సీఈఓ గోవింద్ మంగళవారం సందర్శించారు. మండలంలో ఉన్న ఆయా గ్రామాల అభివృద్ధి పనులు, నిధులు, ఆన్‌లైన్ నమోదుతో పాటు మండలంలో జరుగుతున్న అని రకాల పనులపై ఎంపీడీఓ నవనీత్ కుమార్‌ను ఆడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. దీంతో గ్రామంలో ఎప్పటికపుడు గ్రామాలను సందర్శించి, సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. అనంతరం జెడ్పీ సీఈఓ గోవింద్‌ను ఎంపీడీఓ, ఎంపీఓ సన్మానించారు. ఆయన వెంట ఎంపీడీఓ నవనీత్ కుమార్, ఎంపీఓ మోహన్‌సింగ్ సిబ్బంది ఉన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- రామగుండము సీపీ శ్రీనివాసులు

నవతెలంగాణ-మంచిర్యాల



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పటు చేస్తామని, ప్రవర్తనలో మార్పు రాకపోతే రౌడీ షీట్ ఓపెన్ చేసి పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ మంగళవారం మంచిర్యాల జిల్లా కు చెందిన రౌడీ షీటర్లకు మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ గతంలో రౌడీ షీటర్లుగా కేసులు నమోదు అయి ఉన్న వారు జిల్లాలో జరిగే పలు కేసుల్లో, గొడవల్లో తలదూర్చినట్లైతే వారిపై పీడీ యాక్ట్ ఓపెన్ చేస్తానని, జీవితాంతం జైలులో గడిపేలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నేర ప్రవృత్తిని విడిచి జీవన ఉపాధి ఏర్పరుచుకొని కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించే అవకాశం ఉందని, గంజాయి పీడీఎస్ రైస్, గుట్కా అక్రమ రవాణాకు పాల్పడినట్లైతే చర్యలు తీవ్ర తరంగా ఉంటాయని తెలియజేశారు. అనంతరం మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. డీసీపీ ఏ భాస్కర్, ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐలు ప్రమోద్ రావు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

టీకాలతోనే పశువుల్లో సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-ఇచ్చోడ

ఉచిత గాలికుంటు టీకాలు ఆవులకు, గేదెలకు ఎడ్లకు వేయించడంతో పశువులు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటాయని పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆడేగామ(బి) గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి డాక్టర్ కిషన్ మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పశు వైద్య అధికారికి గోవింద్ నాయక్‌కు సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను 380 పశువులకు వేసినట్లు తెలిపారు. అందులో 150 ఆవులు, 160 గేదెలు, 70 ఎడ్లలకు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకురాలు సంధ్య, వైద్య సిబ్బంది శేఖర్, శ్రీను, పశు యజమానులు పాల్గొన్నారు.

గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న కార్మికులు గైర్హాజరు కాకుండా ఉద్యోగం సక్రమంగా చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం పొందిన 28 మంది యువతీ-యువకులకు జీఎం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. అదే విధంగా వారి తల్లిదండ్రులను, అత్త మామలను కూడా మంచిగా చూసుకోవాలని సూచించారు. సింగరేణిలో రెండవ తరానికి ఉద్యోగాలు రావడం మీ అదృష్టంగా భావించాలి అని అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రగతి పథంలో వెళ్తుందని దానికి అనుగుణంగా ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఉద్యోగంలో నైపుణ్యాన్ని పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సీనియర్ ఉద్యోగుల సలహాలు సూచనలు తీసుకుని ప్రమాద రహిత సింగరేణిగా చేయాలని కోరారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 3498 కారుణ్య నియామక పత్రాలను జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, డీజీఎం(ప) పి అరవింద రావు, సీనియర్ పీఓ కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆలూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారులకు పంటను అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం రైతులకు మద్దతు ధర వరికి సన్నకు రూ.2,300, దొడ్డకు రూ.2,320, అలాగే ప్రభుత్వం కేటాయించిన సన్న రకాలకు రూ.500 బోనస్ అదనంగా పొందాలని తెలియజేశారు. అనంతరం రూ.3.20లక్షల నిధులతో బోరింగ్ తండా, మహావీర్ తండాలకు బీటి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలూర్ సొసైటి వైస్ చైర్మెన్ లక్ష్మీ నారాయణ, మార్కెట్ చైర్మెన్ అబ్దుల్ హాది, బీజేపీ సీనియర్ నాయకులు మండల కన్వీనర్ కారేపే విలాస్‌తో పాటు మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భీం స్ఫూర్తితో ఆశయ సాధనకు పోరాడుదాం

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుమురంభీం స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడతామని కుమురంభీం ఆశయ సాధనకు పోరాడుదామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి కుమరంభీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ఆదివాసీలను అడవులకు దూరం చేసే విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. కుమురంభీం పోరాడిన జల్, జంగల్, జమీన్ ఆదివాసీలకు దక్కకుండా చేసేందుకు నూతన అటవీ విధానం కేంద్రం తీసుకొచ్చి అడవుల ప్రవేటికరణ చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వాల ఆదివాసీ వ్యతిరేక విధానాలపై కుమురంభీం స్ఫూర్తితో పోరాడుతు వారి ఆశయ సాధనకు నేటితరం యువత ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతం పరిరక్షణ, షెడ్యూల్ ఏరియా హక్కుల పరిరక్షణకై పోరాడినప్పుడే ఆదివాసీలకు భవిష్యత్ ఉందని దాని రక్షణకై పోరాటాలను నిర్మించేందుకు ఆదివాసీలు ఐక్యంగా ముందుకు కదలాలని కోరారు. 76 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో ఇంకా కనీస వసతులు లేని గ్రామాలు, విద్యా వైద్యం గిరిజన ప్రజలకు అందని ద్రాక్షల మారాయని, గిరిజన ప్రజల అభివృద్ధిని మర్చిన పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఆశన్న పాల్గొన్నారు.

జల్ జంగల్ జమీన్ పోరాట యోధుడు కొమురంభీం

నవతెలంగాణ-నార్నూర్



జల్, జంగల్, జమీన్, పోరాట యోధుడు కొమురంభీం అని జిల్లా సార్మేడి దుర్గు పటేల్, తుడుందెబ్బ జిల్లా నాయకులు పుర్క బాపూరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన కుమురంభీం 84వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వివిధ ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలోని ఖాందేవునికి పూజలు చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్‌తో పాటు గిరిజన ఆదివాసీ జాతి, ఆదివాసీ హక్కుల కోసం కుమురంభీం అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా నాయకురాలు పెందూర్ పుష్పారాణి, జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, ఉట్నూర్ డీసీ నాగేందర్, జిల్లా సీనియర్ నాయకులు యునుస్ అక్బాని, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జ్ఞానోబా పుష్కర్, మాజీ జెడ్పీటీసీ కర్మాన్కర్ బ్రీజులాల్, పేసా చైర్మెన్ రాథోడ్ సికిందర్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, ప్యాక్స్ డైరెక్టర్ దూర్గే కాంతారావ్, తొమ్మిది ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | అక్టోబర్ 23, 2024 | www.navatelangana.com

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

నవతెలంగాణ-సారంగాపూర్



విద్యార్థుల హాజరుశాతం పెంచాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి పరుశురాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. సైన్స్ విద్యార్థులకు ఇప్పటినుంచి ఎంసెట్ తరగతులతో పాటు ప్రయోగాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కందుర్ శంకర్, అధ్యాపకులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పును వాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



అయోడిన్ ఉప్పును వాడాలని అంకోలి పీహెచ్‌పీ డా.సర్ఫరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకోలి పీహెచ్‌సీలో అయోడైజ్డ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, సాధారణ రోగులతో ఉప్పులో ఉండే అయోడిన్ గూర్చి వివరించారు. శరీరక, మానసిక ఆరోగ్యం, సరైన పెరుగుదల, చురుకుదనం, ఉత్సాహం, జ్ఞాపకశక్తి కల్గిఉండుట, గర్భస్థశిశువు పెరుగుదల, చదువుల్లో వయసుకు దగ్గ ప్రతిభ చూపుడం, అయోడిన్ ఉప్పు ఆరోగ్యమైన జీవితానికి నాంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్స్ బొమ్మెత సుభాష్, శకుంతల, శ్యామల, ప్రేమ్‌సింగ్, స్వామి, తిరుమల, ప్రతిమ, అశాకార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గుస్సాడీ ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని లింగాట్ల, గొండుగూడెం గ్రామ పటేల్ ఇంటి వద్ద మంగళవారం గుస్సాడీ ఉత్సవాలు నిర్వహించారు. గుస్సాడీ విగ్రహ జెండా వద్ద సామాగ్రిని ఉంచి నైవేద్యాలను పెట్టి దీపావళి వేడుకలను ప్రారంభించారు. నేటి నుంచి ఉత్సవాలు జరుపుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆశేరావు, పూజారి ఆనందరావు, భీంరావు, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నార్నూర్

దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ మంగళవారం మలంగి తండాలో ప్రవీణ్ నాయక్‌ను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాదవ్ శ్రీరాం నాయక్, నారాయణ నాయక్, మాజీ సర్పంచ్ రాజు, గులాబ్ మహారాజ్, సుభాష్ ఉన్నారు.

ఘనంగా కుమురంభీం జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

ఆదివాసుల ఆరాధ్యదైవం కుమురంభీం జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌లు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం అధ్యక్షత వహించగా జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబ్ ఉల్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్ మోసాల గురించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు పాల్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి, రఘు, ఎన్‌సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, సైబర్ క్రైమ్ సిబ్బంది సంతోష్, అబ్దుల్ అహెద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమురంభీంను యువత ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-కడెం



కుమురంభీంను యువత ఆదర్శంగా తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు సతీష్‌రెడ్డి అన్నారు. కుమురంభీం జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని కుమురంభీం విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్, అనే నినాదంతో కుమురంభీం చేసిన పోరాట స్ఫూర్తి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రమేష్ వర్మ, జిల్లా నాయకులు శాంతాన్‌రెడ్డి, మండల నాయకులు ముస్కు రాజు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, రహీమ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకల శ్రీనివాస్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, కడెం మాజీ సర్పంచ్ అనూష లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు కమలాకర్, దుర్గం రాజేష్, వెంకటి, రాజేశ్వర్, లచ్చన్న, గంగన్న, బ్రహ్మాచారి, గంగాధర్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-సిరికొండ

మూడు సంవత్సరాలలోపు పిల్లలందరికీ బాలమృతంతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందించి, వారి ఎదుగుదలను పరిశీలిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని సుంకిడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సుంకిడి గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్‌వాడీ టీచర్లు పిల్లల ఎత్తు, బరువులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చిన్నారులు ఏడుస్తూ ఉంటే కలెక్టర్ వారికి చాక్లెట్‌లను అందజేసి సముదాయించారు. మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలోని పాఠాలను చదివించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు. టీచర్ల సమస్య లేనందున విద్యారులు ఎక్కువగా పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులు మేఘన, రిశ్వంత్‌లను ఆదిలాబాద్ రెసిడెన్షియల్ పాఠశాల సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, ఇచ్చోడలోని బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించేందుకు సంబంధిత అధికారితో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగాలంటే ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదవాలని అన్నారు. అప్పుడే ఆ లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుండే కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. విద్యతోనే గౌరవం లభిస్తుందని అన్నారు. మధ్యహ్నం భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంచి భోజనం అందించాలని అన్నారు. మెనూ ప్రకారం అందించి, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి, అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణిత, తహసీల్దార్ తుకారాం, ఎంఈఓ సునీల్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ సంతోష్, ఏపీఓ సంతోష్ పాల్గొన్నారు.

రైతు వేదికగా ఉద్యమబాట



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బూటకపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, రైతు భరోసా ఎగ్గొట్టి ప్రభుత్వం రైతుల ఉసురు తీసుకుంటోందన్నారు. ఆరు గ్యారంటీలను చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయిందన్నారు. కాంగ్రెస్ 300 రోజుల పాలనలో ఇప్పటికీ 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. ఎకరానికి రూ.పదిహేను వేల రైతు భరోసా, పెన్షన్ల పెంపు, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలను బుట్టదాఖలు చేశారన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా కాబినెట్ సబ్ కమిటి పేరిట కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 24న రాంలీలా మైదానంలో ప్రభుత్వ వైఫల్యాలపై కేటీఆర్ శంఖారావం పూరించనున్నారని, ఈ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, పట్టణాధ్యక్షులు అజయ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గండ్రత్ రమేష్, కుమ్ర రాజు, వేణుగోపాల్ యాదవ్, పరమేశ్వర్, నవతే శ్రీనివాస్, సోనేరావ్, ఐయూబ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆగస్టు నెలలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కొల్‌కత్తాలోని జూనియర్ డాక్టర్ అభయపై అత్యాచార హింస, హత్యపై న్యాయం ఇంతవరకు జరగలేదని, సుప్రీంకోర్టు న్యాయ విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ డిమాండ్ చేశారు. ఐఎఫ్టీయూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం పట్టణంలోని పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫెడరేషన్ చేస్తున్న పెన్‌డౌన్ పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ నారాయణ మాట్లాడుతూ కొల్‌కత్తాలోని ఆర్జి కర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్‌పై లైంగిక హింస, హత్య జరిగి రెండు నెలలు కావస్తున్న విద్యార్థులందరూ సాక్ష్యాలు సీబీఐకి అప్పజెప్పిన సుప్రీంకోర్టు చొరవ చూపడం లేదన్నారు. సీబీఐ సీల్డ్ కవర్లలో సుప్రీంకోర్టుకు అందజేసి, దర్యాప్తును తమకు అప్పగించే కొద్ది రోజుల్లోనే నేరం జరిగిన ప్రదేశంలో సాక్ష్యాలు ధ్వంసం అయ్యాయని ఘాటుగా చెబుతుందన్నారు. న్యాయం ఆలస్యమవడం కూడా అన్యాయం చేసినట్టే, కాబట్టి అత్యున్నత న్యాయస్థానం సీబీఐ ద్వారా ఈ విచారణలో అత్యవసరంగా పూర్తి చేయాలని అత్యాచారం హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మహిళలకు సేఫ్టీ భద్రత కల్పిస్తూ చట్టాలను చేయాలని అన్నారు. అభయకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, నర్సింగ్, ప్రసాద్, పెర్క గంగమ్మ, దండేకర్ వామన్, మడావి గణేష్, మెస్రం మారుతి, తౌఫీక్, కనక దత్తు, లక్ష్మి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, పీఆర్సీ పరిష్కారం చేయాలి

- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన
- తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్ డీఏలు, పీఆర్సీ అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం తపస్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ చౌహాన్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కొలువుదీరిగిన కొత్త ప్రభుత్వం ద్వారా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులు పరిష్కారమవుతాయని, ఉపాధ్యాయుల పది నెలలకు పైగా ఎదురు చూస్తూనే ఉన్నారన్నారు. కానీ ఇచ్చిన కనీస హామీలు నెరవేర్చాల్సిన బాధ్యతను మరిచారన్నారు. ఐదు డీఏలు ఉపాధ్యాయ, ఉద్యోగులు వారి ఖాతాల నుంచి రావాల్సిన జీపీఎఫ్‌లు మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ బిల్లులు, వేతనాలకు సంబంధించిన సప్లమెంటరీ, బిల్లులు మొదలైన అనేక పెండింగ్ బిల్లులు పేరుకుపోయి ఉన్నాయన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకోవడం పట్ల తాత్సారం ప్రదర్శిస్తూ జాప్యం చేయడాన్ని తపస్ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మబద్ధంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వానికి ఎన్నోసార్లు నివేదించిన కనీస స్పందన లేకపోవడంతో తపస్ పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఉపాధ్యాయుడిని కదిలించేలా కార్యక్రమాన్ని చేపట్టిందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నవంబర్ 5న కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో నవంబర్ 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిరసన కార్యక్రమాలలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని పెండింగ్ సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జీఓ నెంబర్ 29 వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఉద్యోగ ఉపాధి రంగాలలో పెద్ద ఎత్తున తెరచాటు జీఓలు తీసుకువస్తుందని గిరిజన లంబాడి ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రూప్1 నోటిఫికేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేస్తూ ఓసీల లబ్ధి పొందడం కోసమే జీఓ నెంబర్ 29 తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే జీఓ నెంబర్ 29 రద్దు చేసి పాత జీఓ ప్రకారమే గ్రూప్-1 ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏ వర్గానికి, ఆ వర్గాలకు మంత్రి పదవులు కేటాయిస్తే, కొత్త జీఓలు తయారు కావని తెలిపారు. జీఓ నెంబర్ 29 రద్దు చేయాని, లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

కేజీబీవీలో సగానికి పైగా ఖాళీలు భర్తీ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లాలోని కేజీబీవీల్లోని 31 ఖాళీల్లో 16 ఖాళీలను జిల్లా కలెక్టర్ అనుమతితో భర్తీ చేయడం జరిగిందని డా.ఏ.రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది మంది పీజీసీఆర్టీ, ఆరుగురు సీఆర్టీలు, యూఆర్ఎస్‌లో ఒక సీఆర్టీలు మొత్తం 16 ఖాళీలు భర్తీ అయ్యాయని, వీరంతా ఆయా కేజీబీవీలలో జాయిన్ అయ్యారని తెలిపారు. చక్కగా పనిచేసి, కేజీబీవీలకు గుర్తింపు తీసుకురావాలని కోరారు.

ఎస్ఆర్ శంకరన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్ఆర్ శంకరన్‌ను యువత ఆదర్శంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలువాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులరిపంచారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన ఎస్ఆర్ శంకరన్ దళితులకు, గిరిజనులకు భూ హక్కులు కల్పించారని అన్నారు. సమాజాభివృద్ధికి విద్యనే ముఖ్యమని నమ్మి గురుకుల విద్యకు బీజం పోసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, సింగరి అశోక్, పూసల ఉశన్న, యేర సుధీర్, పాశం రాఘవేంద్ర, మాధస్తు అర్జున్, బోండ్ల రమేష్, మలపతి సుభాష్, పతిహార ప్రభాకర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యం పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీజేపీ సభ్యత్వ నమోదు టార్గెట్‌ను పూర్తి చేయాలని యెండల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో పట్టణ, మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సభ్యత్వ నమోదుపై బీజేపీ నాయకులకు సూచనలు చేశారు. మండల శాఖకు ఇచ్చిన టార్గెట్ అతిత్వరలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబెర్ మల్లికార్జున్‌రెడ్డి, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి కమల్ నయన్, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, పట్టణ అధ్యక్షులు సాదం అరవింద్ పాల్గొన్నారు.

అన్నదాతల న్యాయం కోసం అండగా ఉంటాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నదాతలకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా నిలుస్తామని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు హాజరు కానున్న నేపథ్యంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని ఖుర్షిద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశాల్లో జోగు రామన్న పాల్గొని, శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్షంపై ఉందన్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్ జిల్లాలో పర్యటించి, సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల విషయంలో ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కనీస సౌకర్యాలు లేక ప్రజలంతా ఇక్కట్లకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షులు అజయ్, ఉపాధ్యక్షులు, అష్రఫ్, సలీం, స్వాగత్, పటేల్, జిలాని, షేజాత్, మోసిన్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-వాంకిడి



మండలకేంద్రంలోని జేతవన్ బుద్ధ విహారలో ఈ నెల 25న వర్షవాస్ ముగింపు కార్యక్రమానికి సంబంధించిన కరత్రాలను మంగళవారం విడుదల చేశారు. వర్శవాస్ కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న నాటిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జైరాం, ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ కుమార్, ఉపాధ్యక్షులు అశోక్ మహోల్కర్, హంసరాజ్, విలాస్, నాయకులు ప్రశాంత్, శివాజీ, విఠల్, రాకేష్, చంద్రమని పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఉట్నూర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు నమోదు చేయడాన్ని ఎస్పీ వద్ద ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమయిందని, ప్రజలను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ కోరారు. గత ప్రభుత్వంలో నిరసనలు వ్యక్తం చేస్తే ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. కార్యక్రమంలో రోకండ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, పరమేశ్వర్, రాజు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

- ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో

నవతెలంగాణ-తాంసి



రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పొన్నారి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నారి గ్రామానికి చెందిన గుమ్మల దేవన్న(38) మంగళవారం మధ్యాహ్నం హస్నాపూర్ గ్రామ శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆత్మహత్యకు ముందుగా రైలు పట్టాల దగ్గరకు చేరుకొని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు వీడియో తీసుకొన్నాడు. మృతికి గల కారణాలను వీడియోలో తెలుపకపోయినప్పటికీ చావుకు దగ్గరలో ఉన్నానని వీడియో తీసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. రైల్వే పోలీసులు సంఘటనలు చేరుకొని పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకుని ఆరోగ్యంగా ఉండాలని, రోజువారీ జీవనశైలిలో మంచి ఆహార నియమాలు పాటించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పిస్తూ, మార్నింగ్ వాక్ చేపట్టారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణతో కలిసి ఈ ర్యాలీని ప్రారంభించారు. వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రిమ్స్ నుంచి ప్రారంభమైన ఈ వాక్ కలెక్టర్‌చౌక్ మీదుగా ఇందిరా ప్రియదర్శిని క్రీడామైదానం వరకు సాగింది. ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకూ బ్రెస్ట్ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. 40 సంవత్సరాలు పైబడిన మహిళల్లోనే ఇది ఎక్కువగా ఉంటోందన్నారు. ముందు జాగ్రత్త చర్యల ద్వారా దీన్ని నివారించవచ్చన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించినట్లయితే తగిన చికిత్స ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌ను అరికట్టవచ్చని డిఎంహెచ్ఓ కృష్ణ సూచించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ బ్రెస్ట్ క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పిస్తామని, ఆదిలాబాద్‌ను క్యాన్సర్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత కొన్నాండ్లుగా ఎదుర్కొంటున్న నీటి ఇక్కట్లను తీర్చాలని, జఠిలంగా మారిన సమస్యను వెంటనే పరిష్కరించాలని పట్టణంలోని కేఆర్‌కే కాలనీ వాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి, ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని వార్డు నెంబర్ 7, 8 కేఆర్‌కే కాలనీలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ నీటి సరఫరా కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకున్న పాపానపోవడంలేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని, నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సందర్భంలో అక్కడకు వచ్చిన అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

క్రీడల్లో రాణించేందుకు నిత్య సాధన అవసరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రతిరోజు సాధన చేయడం ద్వారానే క్రీడల్లో రాణించగలరని ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కాంతారావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అండర్-17 బాలబాలికల విభాగంలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అతిథులు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంతరావు మాట్లాడుతూ నిర్మల్‌లో జోనల్ మీట్ ఉంటుందన్నారు. ఈనెల 28 నుంచి 30 వరకు స్టేట్ మీట్ ఉంటుందని తెలియజేశారు. బాలబాలికల విభాగంలో పదిమంది చొప్పున ఉత్తమ ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి నిర్మల్‌కు పంపిస్తామన్నారు. స్టేట్ మీట్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి పదిమందిని ఎంపిక చేసి స్టేట్ మీట్‌కు పంపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరమణ, రాజేష్, హరిచరణ్, జయశ్రీ, జ్యోతి, వినోద పాల్గొన్నారు.

కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోవడం మూలంగా కార్మికులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు దక్కడంలేదని, కొత్త రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాజంగుల రాజు అన్నారు. మంగళవారం కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. దాదాపు 40 రోజులుగా ఆన్‌లైన్ సిస్టమ్ స్తంభించడంతో రెన్యువల్స్ పూర్తిగా ఆగిపోయాయన్నారు. క్లెయిమ్స్ కావడంలేదని, కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండాపోయిందన్నారు. దీంతో కార్మికులకు రావాల్సిన సంక్షేమ ఫలాలు అందడంలేదన్నారు. మరోవైపు వెల్ఫేర్ బోర్డును సైతం నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, ప్రయివేటు సంస్థలకు అప్పగించకుండా ప్రభుత్వం ద్వారానే కొనసాగించాలన్నారు. ఇంకా ఇతర సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అదనపు గదులకు భూమిపూజ

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో రూ.27లక్షల నిధులతో అదనపు గదుల నిర్మాణం కోసం మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌తో పాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద గిరిజన విద్యార్థులు చదువుకుంటున్న ఆశ్రమ పాఠశాలకు అన్ని వసతులు కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో వేల కోట్ల నిధులతో భవన నిర్మాణాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ సతీష్, మాజీ జెడ్పీటీసీ రాజు, నాయకులు కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, అరుణ్, అశోక్, రజిని, రఘు, హాస్టల్ ప్రాధన ఉపాధ్యాయులు సంతోష్, ఆయా పార్టీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బాసర, తానూర్, లోకేశ్వరం విద్యార్థులకు, సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. డిగ్రీ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని భైంసా, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరహాలో ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కళాశాల మంజూరు కావాలని ముధోల్ మండలవాసులు, ముధోల్ గ్రామస్తులు, వీడీసీ సభ్యులు కృషి చేశారన్నారు. వారి చిరకాల కోరిక ఇప్పుడు నేరవేరటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు, వీడీసీ సభ్యులకు, మాజీ సర్పంచ్ వెంకటపూరం రాజేందర్‌కు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య, నిర్మల్ ప్రిన్సిపాల్ సుధాకర్, ముధోల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, కోశాధికారి సాయినాథ్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు రోళ్ల రమేష్, సాంఘ్లీ రమేష్, తాటివార్ రమేష్, దశరథ్, సుదర్శన్, శ్రీనివాస్, పోతన్న, సాయిరాం, గ్రామస్తులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతిపై చర్చకు సిద్ధం



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలో బీఆర్ఎస్ అవినీతిపై చర్చకు సిద్ధమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పుదరి తిరుపతి, తోట రవి, పుస్కూరి శ్రీనివాస్‌రావులు మాట్లాడారు. దసరా ముందు రోజు నుంచి మండలంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకుల పైనే దాడులు చేస్తున్నారని అన్నారు. మాజీ ఎంపీపీ భర్త మందపల్లి శ్రీనివాస్ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ప్యాకేజీ నిర్వాసితులకు ప్యాకేజీ ఇప్పించడం అవినీతికి పాల్పడ్డారని సాక్ష్యాలతో చూపించారు. ఆయన కుటుంబం రెండు గ్రామాల్లో ప్యాకేజీ తీసుకుందని ఆధారులు చూపించారు. పడ్తనపల్లి మాజీ సర్పంచ్ గోళ్ళ శ్రీనివాస్ దళిత బంధు పథకంలో దళిత పేరుపై రెండు జేసీబీలు, మిగితా లబ్ధిదారుల నుంచి కమిషన్ తీసుకొని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎంపీపీలకు వాటాలు ఇచ్చారని విమర్శించారు. రాపల్లి గ్రామానికి చెందిన గెల్లు మల్లేష్ యాదవ్ గొర్రెల స్కీం పేరుతో బినామీ పేర్లతో డీడీలు కట్టి రూ.కోట్ల స్కాం చేశారని తెలిపారు. ఇందులో కూడా ఎమ్మెల్యేకు వాట ఉందని విమర్శించారు. స్మశాన వాటిక నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో కేసు నమోదైందని, ఉద్యోగాలు పెట్టిస్తమని డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. మా విమర్శలు ఆధారాలతో సహా ఉన్నాయని కావాలంటూ బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. తాము ఎవరిపైనా దాడులు చేయడం లేదని బీఆర్ఎస్ నాయకులే దాడులు చేస్తూ కేసుల పాలవుతూ కాంగ్రెస్ నాయకులను విమర్శించడం శోచనీయమన్నారు. అక్రమ మట్టి ఇసుక దందా, ఎల్లంపల్లి నిర్వాసితుల నుండి మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుకు రూ.కోట్ల ముట్టాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు ఒడ్డే బాలరాజు, బాపు, మాజీ సర్పంచ్ కొట్టే మహేందర్, ఒడ్డే సీను, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, చింతపండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్టీయూటీఎస్ అభ్యర్థిని గెలిపిద్దాం

నవతెలంగాణ-నస్పూర్



మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా నస్పూర్ మున్సిపాలిటీ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తీగలు పహడ్‌లో ఓటర్ నమోదు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నవంబర్ 1, 2018 నుంచి అక్టోబర్ 31 2024 వరకు గడిచిన ఆరు సంవత్సరాలలో మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాలలో, కళాశాలలో గాని బోధన అనుభవం గల ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులని గుర్తు చేశారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్యంలో ఓటు విలువను సమాజానికి చాటి చెప్పాలని తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు గతంలో 10 నెలల జీతం మాత్రమే వచ్చేదని పీఆర్టీయూ టీఎస్ ప్రాతినిధ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి 12 నెలల వేతనం అందించేలా కృషి చేసిన ఘనత తమ సంఘానిదేనన్నారు. మహిళా ఉపాధ్యాయినిలకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. వీరికి త్వరలోనే మినిమం టైం స్కేల్ వర్తింప చేసే విధంగా కార్యచరణ ఉండబోతుందని తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు అందించ గలిగామని తెలిపారు. నూతనంగా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియామకమైన వారు అప్రెంటిస్ అనేది లేకుండా నేరుగా పూర్తి వేతనాన్ని పొందడంలో పీఆర్టీయూటీఎస్ పాత్రను గుర్తు చేస్తూ అతి త్వరలోనే ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించడం ద్వారా లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్ మండల విద్యాధికారి, జిల్లా ఉప విద్యాధికారి లాంటి పోస్టులకు ప్రమోషన్ పొందడానికి మార్గం సుగమం అవుతుందని తెలిపారు. పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుగా వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల శాఖ అధ్యక్షులు నాగరాజు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి రామన్న, వేణుగోపాల్, ఆనంద్, చక్రపాణి పాల్గొన్నారు.

రేపటి నిరసన సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

24న గురువారం నిర్వహించే కేటీఆర్ నిరసన సభ విజయవంతం చేయాలని, బీఆర్ఎస్ నాయకులు కోరారు. మంగళవారం కచ్‌కంటి, చిట్యాలబోరి, పందిరిలొద్ది, చించుఘాట్, లోకారి గ్రామాల్లో గ్రామస్తులు పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రమణ, గంగయ్య యాదవ్, జంగుబాపు, జగదీష్ యాదవ్, బుచ్చన్న, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ప్రసవించిన గిరిజన మహిళ

నవతెలంగాణ-సిరికొండ



ఇంటి వద్దే గిరిజన మహిళ ప్రసవించిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన పెందూర్ సోని అనే గిరిజన మహిళకి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో అంబులెన్స్ గ్రామానికి చేరుకుంది. మహిళకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఇంటి వద్దే సిబ్బంది ఆ మహిళకు పురుడు పోశారు. దీంతో ఆ గిరిజన మహిళా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మెరుగైన వైద్యం కోసం పిట్ట బొంగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఈఎంటి కాశీనాథ్, పైలట్ రాజేష్‌లు తెలిపారు.

విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం



నవతెలంగాణ-మంచిర్యాల

విద్య కాషాయీకరణకు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతామని, విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులూ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ అర్థశతాబ్ది వారోత్సవల సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీకాంత్ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ సమసమాజ స్థాపన లక్ష్యంతో ఏర్పడిందని, తెలంగాణ సాయుధ రైతంగ పోరాట స్ఫూర్తితో నక్సల్బరీ శ్రీకాకుళం సాయుధ పోరాట వారసత్వంలో పీడీఎస్‌యూ స్థాపించబడిందన్నారు. అసమానతలు లేని దోపిడి లేని సమ సమాజం కొరకు పీడీఎస్‌యూ పోరాడుతుందని, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో, దోపిడి లేని పెట్టుబడిదారీ భూస్వామ్యానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేసిందని అనేక మంది విప్లవ ఉద్యమంలో అమరులైనారని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ ఉద్యమంలో మరింత ముందుకు పోవాలని పూర్వ విద్యార్థులు ప్రసంగించారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా అక్టోబర్ 24న హైదరాబాదులో జరిగే భారీ బహిరంగ సభకి పూర్వ విద్యార్థులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు డా ఆర్.ప్రకాశం, అజ్మీరా లాల్ కుమార్, అందే మంగ, తాళ్లపల్లి శ్రీనివాస్, అరుణోదయ రాష్ట్ర కోశాధికారి మంతెన మల్లన్న, పూర్వ విద్యార్థులు సమ్మయ్య, ప్రస్తుత విద్యార్థి నాయకులు కె కార్తీక్, విజయ్, అంజి, రాజ్ కుమార్, తిరుపతి విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సరండి గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఎస్ఐ ప్రశాంత్ పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి సరండి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట ఆడుతుండగా అందులో ఒకరు పారిపోయాడు. మిగిలిన లుగురుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.5500 నగదును స్వాదీనం చేస్తున్నట్టు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ఎవరైనా పేకాట ఆడుతున్నట్టు సమాచారం తెలిస్తే ఎస్ఐ 8712670531 అలాగే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎకరానికి రూ.7,500 రైతుభరోసా కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా రైతులకు ఎకరానికి రూ.7500 రైతుభరోసా కల్పించాలని, ప్రతి రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, ఇతర సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక విషయాలపై చర్చించారు. ఆనాడు ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని గుర్తు చేశారు. కానీ నేటికి 9నెలలు గడిచిపోయినా అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతు బీమా, రైతులు వేసిన పంటలకు ఫసల్ బీమా వంటివి నెరవేర్చడంలేదని ఆరోపించారు. వెంటనే రైతు భరోసా చెల్లించి, ప్రతి రైతుకు రూ2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమండ్ చేశారు. సమావేశంలో దేవర్తి స్వామి, కొండ రమేష్, రోకండ్ల రమేష్, మేకల నారాయణ, చిలుక దేవిదాస్, వామన్, నారాయణ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ-నస్పూర్

బ్యాంకింగ్ ఐబీపీఎస్(పీఓఎస్, క్లర్క్స్) పరీక్షల కొరకు రాష్ట్రానికి చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు అక్టోబర్ 27వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం ఒక ప్రకటనలో పేర్కొనారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో స్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులను మెరిట్, రిజర్వేషన్ పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండరాదని, ఎంపికైన అభ్యర్థులకు నెలవారి స్టైఫండ్, స్టడీ మెటీరియల్, లాంగ్ నోట్ బుక్స్ అందించడం జరుగుతుందని, వివరాలకు 040-27540104లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లాకు చేరుకున్న సైకిల్ యాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందు ధర్మం పరిరక్షణకు విస్తృత అవగాహన కల్పించేందుకు, హిందువులను సంఘటితం చేసేందుకు బెంగళూరు నుంచి అయోధ్య వరకు చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. వీరికి స్థానిక శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామిజీ, పలువురు హిందూ ధార్మిక సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం యాత్రికులను ఘనంగా సన్మానించి సాగనంపారు.

భీం ఆశయ సాధనకు కృషి చేద్దాం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేద్దామని నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ ప్రాంతంలో ఉన్న కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ నినాదంతో గిరి పుత్రుల హక్కుల కోసం సాయుధ పోరాటం చేసిన యోధుడు, కుమురంభీం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మెన్ సామ భీమ్‌రెడ్డి, దేవరకోట ఆలయ చైర్మెన్ కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జన్మదినం రోజు వికలాంగులకు చేయూత



నవతెలంగాణ-బోథ్

మండలకేంద్రానికి చెందిన సామాజిక పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్ కూతురు జక్కుల శ్రీహరిని మంగళవారం జన్మదినం సందర్భంగా నిర్మల్ జిల్లా కొండాపూర్‌లోని మానసిక వికలాంగుల శాంతినికేతన్ పాఠశాల పిల్లలకు తన ఎన్నో రోజల నుంచి దాచుకున్న ప్యాకెట్ డబ్బులతో జన్మదినాన్ని పురస్కరించుకొని పిల్లలకు కాపీలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్రెడ్ ప్యాకెట్స్, బాలసదనంలో నిరాదరణ పిల్లలకు అరటిపండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు జక్కుల వెంకటేష్, సేరే రమణ, సేరే వ్యాస్, జక్కుల శ్రీహరిని పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థినిలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినిలు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె రమణ కళ్యాణి తెలిపారు. ఈ నెల 4, 5, 6 తేదీలలో నారాయణపేట జిల్లాలోని ధన్వాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు తరఫున పోటీలో పాల్గొన్నారు. ఆ పాఠశాలకు చెందిన డి శాలిని, ఎం స్పందన, సీహెచ్ సహస్ర అను ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి చౌదరి చరణ్‌సింగ్ యూనివర్సిటీ(మీరట్) ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే కుస్తీ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను కళాశాల ప్రిన్సిపల్ కె రామ కళ్యాణి, వైస్ ప్రిన్సిపల్ కె మహేశ్వర్‌రావు, పీఈటీలు మమత, నవ్య, కళాశాల ఉపన్యాసకులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

విద్యుద్ఘాతంతో యువకుడి మృతి

నవతెలంగాణ-మందమర్రి



ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మందమర్రిలో చోటు చేసుకుంది. రెండవ జోన్‌కు చెందిన గోగ్గుల సత్య అన్వేష్(22) స్నానం చేసి తీగపై తువ్వాల ఆరవేస్తుండగా తీగకు విద్యుత్ సరఫార కావడంతో అక్కడే కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు సింగరేణి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరిశీలించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మందమర్రి ఏఎస్ఐ మల్లేష్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రైతులు సహకరించాలి

● విద్యుత్ శాఖ ఏడీ బాలకిషన్



నవతెలంగాణ-జైపూర్

వ్యవసాయ బోరుబావులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం కోసం రైతులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏడీ బాలకిషన్ సూచించారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఏఈ మనోహర్‌తో కలిసి నర్సింగాపూర్ శివారు రైతులకు విద్యుత్ సరఫరా విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాకు సంబంధించిన వ్యక్తిగతంగా ఎలాంటి పనులు చేయకూడదని తెలిపారు. అదేవిధంగా 5 హెచ్‌పీ విద్యుత్ మోటర్ వినియోగిస్తున్న రైతులు విధిగా కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. కెపాసిటర్లు బిగించడం ద్వార విద్యుత్ సరఫరాలో వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులకు అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. ఫలితంగా విద్యుత్ మోటర్ చెడిపోకుండా ఉండటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యుత్ మోటర్ వద్ద కెపాసిటర్ బిగించడం ద్వార లోడ్ తక్కువగా పడుతుండటంతో ఇటు విద్యుత్ మోటర్, అటు ట్రాన్స్‌ఫార్మర్ సేఫ్‌గా ఉంటుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఎదురైనా స్థానిక విద్యుత్‌శాఖ సిబ్బంది ద్వార సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా ఎలాంటి సాహసం చేసినా ప్రమాదంలో ఇరుక్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయాలపై సమీప రైతులకు సమాచారం ఇవ్వడం ద్వార పంటల సాగుకు సంబంధించిన విద్యుత్ సరఫరాకు నాణ్యమైన విద్యుత్ అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బతుకమ్మ చీరల పంపిణీ



నవతెలంగాణ-జన్నారం

బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు అందించే బతుకమ్మ చీరలను మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శి లావణ్య ఐకేపీ సీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ చీరలను డ్వాక్రా గ్రూప్ మహిళలకు మాత్రమే పంపిణీ చేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలు ఈ చీరలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులావత్ రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.500 కే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, ఐకేపీ సీఏ లలిత, అంగన్‌వాడీ టీచర్ జాడీ సంజీవరాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిందం చంద్రయ్య, రేగుంట ప్రదీప్ కూకటికారి శ్రీనివాస్, గుండ నరసయ్య, కోవ శాంతయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బీసీ జాగృతి సేన అధికార ప్రతినిధి నియామకం

నవతెలంగాణ-జన్నారం

బీసీ జాగృతి సేన జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన దండవేణి శ్రీధర్‌ను నియమించినట్లు బీసీ జాగృతి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలు ఐక్యంగా ఉండి పోరాటాలు చేస్తేనే హక్కులను సాధించుకోవచ్చు అన్నారు. అన్ని గ్రామాల్లో బీసీ జాగృతి సేన కమిటీలను వేయనున్నట్లు తెలిపాలరు.

తొమ్మిది నెలల్లోనే అభివృద్ధి చేసి చూపించాం

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్



నవతెలంగాణ-జన్నారం

గత 10 సంవత్సరాలలో జరగని అభివృద్ధి, కేవలం 9 నెలలోనే చేసి చూపించామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, రూ.500 కు సిలిండర్, ఇస్తున్నామన్నారు. త్వరలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు. హరీష్‌రావు, కేటీఆర్ గ్రూప్-1 విద్యార్థులతో చెలగాటమాడుతున్నారన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి చేస్తున్నాడన్నారు. జన్నారంలో మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు బ్రిడ్జి సౌకర్యాలు కల్పిస్తూ మండలాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నాడన్నారు. త్వరలో మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కొంతమంది ప్రతిపక్ష నాయకులు పార్టీపై బురద జల్లుతున్నాని విమర్శించారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి, ముత్యం రాజన్న గుర్రం మోహన్ రెడ్డి, మత్స్య శంకరయ్య మామిడిపల్లి ఇందయ్యా, సయ్యద్ పశువుల్లా, ముత్యం సతీష్, దుమల రమేష్, సుధాకర్ నాయక్, లక్ష్మీనారాయణ, ముజ్జు, మహమ్మద్ రజాక్, ప్రశాంత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మాయమైన మంచిర్యాల సెల్ఫీ పాయింట్

● విచారణ చేపట్టాలంటున్న బీఆర్ఎస్ నాయకులు
● మేమె తొలగించాం అంటున్న కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో గత రెండేండ్ల కిందట ఏర్పాటు చేసిన మంచి మంచిర్యాల సెల్ఫీ పాయింట్ ఉన్నట్టు ఉండి కనపడకుండా పోవడంతో పట్టణ వాసులు ఆలోచనలో పడ్డారు. ఏమైంది ఎవరు తీసి ఉంటారు అన్న ఆలోచనలు పట్టణంలోని ప్రజలకు రేకెత్తాయి. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మంగళవారం ఉదయం సెల్ఫీ పాయింట్ దగ్గర కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రశాంత వాత వరణానికి కేంద్రంగా ఉన్న మంచిర్యాలలో పట్టణ సుందరీకరణలో భాగంగా మంచిర్యాల ప్రజల కోరిక మేరకు మంచి మంచిర్యాల సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, సెల్ఫీ పాయింట్‌ను తొలగించిన ఎంతటి వారిని అయిన ఉపేక్షించవద్దని విచారణ చేపట్టి తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దివాకర్‌రావు పోలీసులను, మున్సిపల్ అధికారులను కోరారు.

మేమె తొలగించాం

ఐబీ చౌరస్తాలోని మంచి మంచిర్యాల బోర్డును ఎవరు ఎత్తుకుపోలేదని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో భద్రంగా ఉందని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం సందర్భంగా బోర్డు దెబ్బతింటుందనే ఉద్దేశ్యంతో ముందు జాగ్రత్తగా మున్సిపల్ కార్యాలయంకు తరలించామని, సమాచార లోపం వాళ్ళ మున్సిపల్ కమీషనర్‌కు విషయం తెలియలేదన్నారు. ఈ విషయాన్ని కూడా రాద్ధాంతం చేసి రాజకీయం చేయాలని చూడడం శోచనీయమన్నారు. ఇష్టానుసారంగా విమర్శలు చేసి కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు.

వ్యవసాయ సాగులో డ్రోన్ సాంకేతికత వినియోగంపై అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

సమీకృత వ్యవసాయ విధానం, డ్రోన్ సాంకేతికత వినియోగంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జగిత్యాల, సిరిసిల్ల కళాశాలలకు చెందిన కృషి అనుభవ విద్యార్థులకు మండల వ్యవసాయ అధికారి గాదర్ల కిరణ్మయి, ఏఈఓలు ముత్యం తిరుపతి, సయిండ్ల కనకరాజులు బొక్కలగుట్టకు చెందిన ఎడ్ల రాజలింగు వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వ్యవసాయ విదానంపై అవగాహన కల్పించారు. సమీకృత వ్యవసాయ విధానంలో వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైనటువంటి పాడి, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం మొదలగు చిన్నతరహా పరిశ్రమలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ విధంగా సమీకృత విధానంలో వ్యవసాయం చేయడం ద్వారా రైతుకు ఎక్కువ నికర ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ వ్యర్థాలను పశువుల మేతకు అదే విధంగా పశువుల పేడను పంటలకు ఎరువులుగా వినియోగించుట ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచని తెలిపారు. సమీకృత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సారంగపల్లి గ్రామములో నాగమల్లేశ్‌కు చెందిన పొలంలో డ్రోన్ పరికరం ద్వారా పురుగు మందుల పిచికారిపై ప్రదర్శనాత్మక అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా కేవలం పది లీటర్ల నీటితో కేవలం ఆరు నిమిషాల్లో ఒక ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చునని తెలిపారు. తక్కువ ఖర్చు తక్కువ సమయంలో పురుగుమందుల పిచికారికి ఈ డ్రోన్ సాంకేతికత చాలా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నవితేజ, శ్రీచరన్, విపిన్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు

● దోపిడీ దొంగలకు కొమ్ముకాస్తున్న బీజేపీ, బీఆర్ఎస్లు
● కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి



నవతెలంగాణ-దండేపల్లి

మంచిర్యాల నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి చేస్తున్న నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆయన అనుచరులు చేసిన తప్పిదాలను కప్పిపుచడానికి బీజేపీ, జిల్లా నాయకుడు రఘునాథరావు పనిచేస్తున్నారని ఆరోపించారు. మండలానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు అజ్మీర హరి నాయక్ చెరువుల ఆక్రమణ వ్యవహారంలో, కబ్జా అక్రమ మట్టి, ఇసుక రవాణా చేసిన ఆరోపణలు ఉన్నాయన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని ఈ విషయంలో తమ నాయకుడు ప్రేమ్‌సాగర్ రావుకు ఎటువంటి సంబందం లేదని ఆయన పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారుల చర్యలపై ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై ఆరోపణలు సరికావన్నారు. బీజేపీ నాయకులు మత గొడవలు సృష్టించి రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుడు దివాకర్‌రావు తాను చేసిన తప్పులను, అనుచరులను కాపాడుకోవడానికి ఎమ్మెల్యేపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందంజలో ఉంచారని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే వారు ఎవరైనా శిక్షార్హులు అని అన్నారు. నిరాధార ఆరోపణలు చేయడం ఆపకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, కొంగల నవీన్, గడ్డం రామచందర్, వనపర్తి రవి, బిళ్ళకూరి, గాజుల లక్ష్మినారాయణగౌడ్, వెంగల్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయి నాటు సారకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-తాండూర్

గిరిజన ప్రజలు గంజాయి, నాటు సారకు దూరంగా ఉంటూ తమ జీవితాలను బాగుపరచుకోవాలని తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి సూచించారు. మంగళవారం తాండూర్ సర్కిల్ పరిధిలోగల హాసన్ మాడ గిరిజన గ్రామంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. మాదారం ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు పోలీస్ సిబ్బంధితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామి అక్కడి గిరిజన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి సేవించడం అమ్మడం, పండించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. గంజాయి సాగు, నాటు సార తయారీ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. కుటుంబ పెద్దలు గంజాయి నాటుసారకు అలవాటు పడితే వారి పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారని తెలిపారు. చెడు వ్యసనాల వల్ల కుటుంబం మొత్తం చిన్నభిన్నమయ్యే అవకాశాలున్నాయన్నారు. గంజాయి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని చెప్పారు. పిల్లలకు యువకులకు మంచి నడవడిక నేర్పించి ఉద్యోగాల్లో స్థిరపడే విధంగా ప్రోత్సహించాలన్నారు. గిరిజన ప్రజలు గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను పోలీసులు దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఉన్నత అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని సీఐ తెలిపారు. గ్రామంలో అసాంఘిక శక్తులకు షెల్టర్ ఇవ్వద్దని, కొత్త వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారం భీమిని ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బంది రమేష్, వెంకన్న, అశ్విని, తులసిరాం, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని, జన్నారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామంలోని రైతుల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలోని అన్ని పశువులకు గేదెలకు ఉచితంగా గాలి కుంటూ నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర గాజర్ల రాజన్న, రమేష్ సాగర్ రవి పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతూ ఇద్దరు అరెస్ట్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతూ ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయి అమ్ముతూ దెబ్బటి నవదీప్, వడ్డేపల్లి యస్వంత్‌లు గంజాయి అమ్ముతూ పట్టుపడ్డారని తెలిపారు. వారి వద్ద నుండి 210 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో 2024, 2025 సంవత్సరాల్లో నిర్వహించే పనులపై, రైతుల వద్ద నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ శశికళ, ఏపీఓ రవీందర్ ఉపాధి హామీలో నిర్వహించే పనులపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి పీఓఆర్డీ జలంధర్, ఈఓ రాహుల్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీ, ప్లాంటేషన్ నిర్వాహణపై అవగాహన ఉండాలి

● మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్



నవతెలంగాణ-జైపూర్

నర్సరీ, ప్లాంటేషన్ నిర్వాహణపై అవగాహణ కలిగివుండాలని మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ సూచించారు. ఫారెస్ట్ అకాడమీ దూలపల్లిలో శిక్షణ పొందుతున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ మంగళవారం టూర్ స్టడీలో భాగంగా భీమారం ఫారెస్ట్ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో మొక్కలు పెంచడం అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ ఏర్పాటు చేయడంపై ట్రైనీ బీట్ ఆఫీసర్లకు అవగాహణ కల్పించారు. ప్రైమరీగా బెడ్స్ తయారు చేయడం, మట్టితో నింపిన బ్యాగుల్లో మొక్కలు పెంచడం, రూట్ ట్రైనర్స్‌లో మొక్కలను పెంచాల్సిన తీరును వివరించారు. అదేవిదంగా మొక్కల కన్వర్షన్ చేయడం, ప్లాంటేషన్ ఏర్పాటుకు ముందు తీసుకోవల్సిన జాగ్రత్తలు చేపట్టాల్సిన పనులపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ వినయ్ కుమార్ సాహూ, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ సుధాకర్, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఎఫ్‌బీఓ బానేష్ పాల్గొన్నారు.

ఘనంగా కుమురంభీం జయంతి

నవతెలంగాణ-జైపూర్

ఆదివాసీ హక్కుల కోసం అలుపెరుగని పోరు సలిపిన పోరాట యోధుడు కుమురంభీం జయంతి వేడుకలు మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివాసీ నాయకపోడ్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

బోరుబావి ఏర్పాటుతో నీటి సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-జైపూర్



ఇందారం గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బోరుబావుల ఏర్పాటుపై దృష్టి సారించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్ తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో ముందస్తుగా గ్రామంలో గల శివాలయం ఏరియాలో నీటి ఇబ్బందులు పరిష్కరించడంతో పాటు శివాలయంకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మంగళవారం బోరుబావి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి సమస్య పట్ల సానుకూలంగా స్పందించి వెంటనే బోరుబావి ఏర్పాటుకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శివాలయం ఏరియా కుటుంబాల వారు తెలిపారు. కాగా గ్రామానికి చెందిన నిమ్మ చందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్ స్థానికులతో కలిసి 50కిలోల బియ్యం అందజేశారు. మృతుని కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు.

రూ. 10 నాణేలపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్

హైదరాబాద్: భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, తెలంగాణలోని 33 జిల్లాల్లో విస్తరించిన తన 430 శాఖలు మరియు 542 బీసీల ద్వారా రూ.10 నాణేల స్వీకరణపై రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (పిఏసి) నిర్వహించింది. ?10 నాణేల చట్టపరమైన చెల్లుబాటుకు సంబంధించి ఉన్న అపోహలను తగ్గించడం, రూ.10 నాణేలపై ఎక్కువ నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడే ఉద్దేశంతో పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు, హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం సహకారాన్ని అందించింది. ఈ క్యాంపెయిన్‌లో బ్యాంక్ మొత్తం రూ.10.96 లక్షల విలువైన రూ.10 నాణేలను పంపిణీ చేసింది/మార్పిడి చేసింది. ఈ కార్యక్రమాన్ని మొదటిగా తెలంగాణ రాష్ట్రంలో బ్యాంకు నిర్వహించింది. గత ఏడాది రూ.16.90 లక్షల విలువైన రూ.10 నాణేలు పంపిణీ చేయబడ్డాయి/మార్పిడి చేయబడ్డాయి.

దుబాయ్ నుండి టాప్ 10 దీపావళి బహుమతులు

హైదరాబాద్: దుబాయ్ దాని సందడిగా ఉండే మార్కెట్ ల నుండి ఆధునిక మాల్స్ వరకు, దాని గొప్ప సంస్కృతి మరియు శక్తివంతమైన స్ఫూర్తిని ప్రతిబింబించే ప్రత్యేకమైన మరియు అద్భుతమైన బహుమతుల శ్రేణిని అందిస్తుంది. సాంప్రదాయం, విలాసంతో మిళితమైన నగరం, దుబాయ్. దీపావళి కోసం పండుగ బహుమతులను కనుగొనడానికి సరైన గమ్యస్థానం. ఈ ఎంపిక చేసిన బహుమతులతో దుబాయ్‌ని మీ ఇంటికి తీసుకురండి, అవి మీ వేడుకలను మరింత శోభాయమానంగా మారుస్తాయి.

అమెజాన్.ఇన్‌లో ధనత్రయోదశి డీల్స్

బెంగళూరు: ఈ ధనత్రయోదశికి, సరికొత్త టెక్ గాడ్జెట్స్, ఆటోమొబైల్స్, గోల్డ్, పండగ అవసరాలపై ఉత్తమమైన అవసరాలను కోరుకునే కస్టమర్ల కోసం సమగ్రమైన షాపింగ్ గమ్యస్థానాన్ని అమెజాన్. ఇన్ అందిస్తోంది. 100% పిన్ కోడ్స్కు డెలివరీ అందచేయడం ద్వారా, స్టోర్ సాటిలేని ఎంపిక, సౌకర్యం ద్వారా షాపింగ్ అనుభవాన్ని అందిస్తోంది. అమెజాన్. ఇన్ శామ్సంగ్ గాలక్సీ, విడాతో సహా ధంతేరస్ స్టోర్లో కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్స్, ఆధునిక టెక్, ఎథ్నిక్ దుస్తులు, గృహోపకరణాలు, శుభప్రదమైన డెకార్, సౌందర్య ఉత్పత్తులు, గోల్డ్ సహా విస్తృతమైన కలక్షన్ ఉంది. కస్టమర్లు యాపిల్, శామ్సంగ్, వన్ ప్లస్, తనిష్క్, టైటాన్, బిబా, హాకిన్స్, గివా, ఓలా, విడా వంటి ప్రముఖ బ్రాండ్స్ నుండి ప్రత్యేకమైన డీల్స్ను పొందవచ్చు, కల్యాణ్ జ్యువలర్స్ 24 క్యారెట్ గోల్డ్ బార్స్, తనిష్క్ ఈ గిఫ్ట్ కార్డ్, శ్రీరామ్ సాలిడ్ సిల్వర్ విగ్రహం, హాకిన్స్ కిచెన్ గిఫ్ట్ ప్యాక్ వంటి ఆఫర్లు ఉన్నాయి.

పారిశ్రామికవేత్తలకు సమయం ఆదాకు.. గో డాడీ ఐరో సొల్యూషన్ సహాయం

హైదరాబాద్: చిన్న వ్యాపారాల కోసం, ప్రతి సెకను ఆదా చేయడం, ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావటం ఆ వ్యాపార మనుగడ, అభివృద్ధి చెందడం మధ్య వ్యత్యాసం చూపుతుంది. గోడాడీ ఇటీవల 94శాతం భారతీయ చిన్న వ్యాపార యజమానులు తమ వ్యాపారాలలో ఏఐని జోడించడం ద్వారా సానుకూల ప్రభావం చూడగలుగుతున్నారని కనుగొంది. గోడాడీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లౌరా మెస్సర్స్మిట్ మాట్లాడుతూ... ఏఐ-శక్తితో కూడిన గోడాడీ ఐరో, నిరంతరం అభివృద్ధి చెందుతుందని, మెరుగు పడుతుందన్నారు. చిన్న వ్యాపారాలు తాజా సాంకేతికతలో ముందంజలో ఉండేలా చూస్తుందన్నారు. చిన్న వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బంది లేని, స్పష్టమైన పరిష్కారాలను అందించడం ద్వారా మనకు తెలిసిన రీతిలో వాడుక పరంగా సౌలభ్యంతో సరికొత్త ఏఐ సాంకేతికతను మిళితం చేసే అత్యాధునిక సాధనాలతో వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడం తమ లక్ష్యమన్నారు.

39 దేశాలకు కేర్ ఎడ్జ్ సావరిన్ రేటింగ్స్

ముంబై: భారతదేశంలోని ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలలో ఒకటైనకేర్ రేటింగ్స్ లిమిటెడ్ యొక్క అనుబంధ సంస్థ కేర్ ఎడ్జ్ 39 దేశాలకు సావరిన్ రేటింగ్స్ ఆఫ్ గ్లోబల్ ఎకానమీస్ యొక్క సావరిన్ రేటింగ్లపై తన నివేదికను ఈరోజు ఆవిష్కరించింది. కేర్ ఎడ్జ్ భారతదేశానికి బిబిబిం దీర్ఘకాలిక విదేశీ కరెన్సీ రేటింగును కేటాయించింది, ఇది భారత ఆర్థిక వ్యవస్థ యొక్క స్థితిస్థాపకమైన పోస్ట్-పాండమిక్ రీబౌండ్ మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడిపై పెరిగిన దృష్టి ఆధారంగా. ఔట్లుక్ సాధారణ ప్రభుత్వ రుణంలో అంచనా వేయబడిన తగ్గింపుకు కారణమవుతుంది, అయినప్పటికీ క్రమంగా, ఆరోగ్యకరమైన నామమాత్రపు జిడిపి వృద్ధికి సహాయం చేస్తుంది మరియు ఆర్థిక ఏకీకరణపై దృష్టిని కొనసాగించింది. కేర్ ఎడ్జ్ జిడిపికి సాధారణ ప్రభుత్వ రుణాన్ని 2030 నాటికి 78%కి మరియు 2035 నాటికి 73.5%కి తగ్గించాలని అంచనా వేస్తుంది. అయినప్పటికీ, ఇప్పటికీ ఎలివేట్ చేయబడిన సాధారణ ప్రభుత్వ రుణం మరియు బలహీనమైన రుణ స్థోమత కీలకమైన క్రెడిట్ పరిమితులుగా మిగిలి ఉన్నాయని విశ్వసిస్తోంది కేర్ ఎడ్జ్ గ్లోబల్ ప్రకారం, భారతదేశం యొక్క క్రెడిట్ మదింపు దాని పెద్ద మరియు విభిన్న ఆర్థిక నిర్మాణంతో పాటు దాని ఆరోగ్యకరమైన వృద్ధి పనితీరు నుండి లాభాలను పొందుతుంది. కేర్ ఎడ్జ్ రాబోయే కొన్ని సంవత్సరాలలో జిడిపివృద్ధిని 6.5-7% పరిధిలో అంచనా వేస్తోంది. అదనంగా, భారతదేశం అధిక విదేశీ మారక నిల్వలు మరియు తక్కువ స్థాయి బాహ్య రుణాలు దాని మొత్తం క్రెడిట్ ప్రొఫైల్కు మద్దతు ఇచ్చే అనుకూలమైన బాహ్య స్థితికి దోహదం చేస్తాయి. అయినప్పటికీ, ఈ సానుకూలతలు అధిక సాధారణ ప్రభుత్వ రుణం మరియు బలహీనమైన రుణ స్థోమతతో సమతుల్యంగా ఉంటాయి. దేశం తక్కువ తలసరి ఆదాయం మరియు అధిక చమురు దిగుమతి ఆధారపడటం (దిశ85%) కలిగి ఉంది, ఇది ప్రపంచ చమురు ధరల షార్ల నుండి ఉత్పన్నమయ్యే దాని దుర్బలత్వాన్ని పెంచుతుంది.

తన డిక్షనరీ పోర్ట్ ఫోలియోకు 13వ భారతీయ భాషను జోడించిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్

హైదరాబాద్: తమిళం, సంస్కృత, తెలుగు, కన్నడ, మలయాళంతో పాటు మరాఠీ, పాళీ, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ, ఒడియా భాషలను కలుపుకుని కేంద్ర మంత్రివర్గం గత వారం భారతదేశపు క్లాసికల్ లాంగ్వేజెస్ జాబితాను 11కి విస్తరించింది. 2005లో క్లాసికల్ హోదాను పొందిన సంస్కృతాన్ని ప్రోత్సహించడానికి విద్యా మంత్రిత్వ శాఖ అనేక చర్యలు తీసుకుంది. ఈ కొత్త ఆక్స్ఫర్డ్ సంస్కృతం-హిందీ-ఇంగ్లీష్ డిక్షనరీలో సంస్కృతం నేర్చుకునే వారి కోసం జాగ్రత్తగా ఎంపిక చేసిన 25,000 పదాలు ఉన్నాయి. పదాల ఔచిత్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రతి సంస్కృత విద్యార్థి ఇప్పటి నుండి పదేళ్లలో సింపుల్ స్టాండర్డ్ సంస్కృతంలో నిష్ణాతులవ ఎతారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుమంత దత్తా మాట్లాడుతూ... ఆక్స్ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, భాషా వైవిధ్యం, జ్ఞాన వ్యాప్తికి ప్రపంచ నిబద్ధతను పెంపొందించడం, భాషల పరిరక్షణ, సుసంపన్నత కోసం అంకితం చేయబడిం దన్నారు. ఈ త్రిభాషా నిఘంటువు భాషా అభ్యాసాన్ని, మన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడంలో తమ నిబద్ధతలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఎన్ఎస్ఈపీ 2020, ఎన్సీఎఫ్ 2023 మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్కృతం నేర్చుకునే ప్రయాణాన్ని ప్రారంభించే విద్యార్థులకు ఇది విలువైన వనరు అన్నారు. ఓయూపీ పబ్లిషింగ్ హిస్టరీ, రిచ్ లెగసీలో ఆక్స్ఫర్డ్ డిక్షనరీలు ముఖ్యమైన భాగం, మమ్మల్ని ప్రపంచంలోని ప్రముఖ డిక్షనరీ పబ్లిషర్గా మార్చాయన్నారు. 50కి పైగా భాషల్లో ప్రచురించబడిన ఆక్స్ఫర్డ్ డిక్షనరీలు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భాషా అభ్యాసకులకు విశ్వసనీయ వనరుగా ఉన్నాయన్నారు.


రూ 47.65 కోట్ల లాభాన్ని ఆర్జించిన ఒలెక్ట్రా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసికానికి రూ 47.65 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ మేరకు సోమవారం కంపెనీ తన ఫలితాలను ప్రకటించింది. త్రైమాసికంలో అధిక డెలివరీల ఫలితంగా గణనీయమైన ఆదాయ వృద్ధి నమోదు చేసిందని కంపెనీ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 90 శాతం పెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది 154వాహనాలను డెలివరీ చేయగా, ఈ ఏడాది 315 ఎలక్ట్రిక్ వాహనాలను పంపిణీ చేసిందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 26.57 కోట్లతో పోలిస్తే 144 శాతం పెరుగుదలతో రూ.64.83 కోట్ల ఆదాయం పెరిగిందని వెల్లడించింది. మొత్తంగా రూ. 47.65 కోట్ల లాభం వచ్చిందని తెలిపింది.

15 రోజుల్లో డ్రోన్ పాలసీ

- ఓర్వకల్లులో హబ్
- సమ్మిట్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- అబ్బురపర్చిన విన్యాసాలు



అమరావతి: పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తల నుండి సలహాలు, సూచనలు తీసుకుని 15 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ డ్రోన్ పాలసీని ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ, ఎపి డ్రోన్ కార్పోరేషన్ సంయుక్తంగా మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో 300 ఎకరాలను డ్రోన్ హబ్ కోసం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. హబ్ ఏర్పాటు అనంతరం 35 వేల మందికి డ్రోన్ పైలట్లగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ హబ్‌లోనే డ్రోన్ల తయారీ రంగాన్ని ప్రారంభిస్తామని, దీనికి సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియాగా అమరావతిని తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలిపారు. రాబోయే కాలమంతా డేటాదేనని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌తో డేటా ను ఉపయోగించి నిర్దిష్టమైన సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. ఎపి డ్రోన్ కార్పొరేషన్ సిఎం సమక్షంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తిరుపతి ఐఐటిలతో ఎంఒయూ కుదుర్చుకుంది. డ్రోన్ ఎకో సిస్టమ్ కొరకు స్ట్రాటజీ ఫ్రేమ్ వర్క్ కాన్సెప్ట్ పేపర్‌ను విడుదల చేసిన అనంతరం డ్రోన్ ఎక్స్‌పోను సిఎం చంద్రబాబు ప్రారంభించారు.

ప్రపంచ డ్రోన్ హబ్‌గా ఎపి : రామ్మోహన్‌నాయుడు

ప్రపంచ డ్రోన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి బాధితులకు ఆహారం, నీరు పంపిణీ చేయడం సరికొత్త విప్లవమన్నారు. దీనిపై ప్రధాని మోడీ సైతం వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. దేశంలో పదేళ్ల కిందట 74 ఎయిర్ పోర్టులుంటే ఇప్పుడు ఆ సంఖ్య 157కు చేరిందన్నారు. పౌర విమానయానం అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుంలున్‌మంగ్ వుల్నమ్, డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు స్మిత్ షా, సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఐ అండ్ ఐ శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, డ్రోన్ కార్పోరేషన్ ఎండి కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన డ్రోన్ షో: ఐదు గిన్నిస్ రికార్డులు

ఈ సదస్సు అనంతరం కృష్ణా నది తీరాన పున్నమి ఘాట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన డ్రోన్ షో ఆహుతులను అకట్టుకుంది. 5,500 డ్రోన్లతో రంగురంగుల కాంతుల్లో అనేక చిత్రాలను ప్రదర్శించారు. డ్రోన్ షో గురించి విస్తృత ప్రచారం నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో జనం కృష్ణా తీరానికి తరలివచ్చారు. విజయవాడలోని ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ డిస్‌ప్లేల ముందు కూడా ప్రజలు బారులు తీరి డ్రోన్‌షోను తిలకించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన లేజర్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన గిన్నిస్ బుక్ ప్రతినిధులు అమరావతి డ్రోన్‌షో చరిత్ర సృష్టించినట్లు ప్రకటించారు. అమరావతి డ్రోన్‌షోలో ఐదు గిన్నిస్ రికార్డులు నమోదైనట్లు వారు తెలిపారు. లార్జెస్ట్ ప్లానెట్ ఫార్మేషన్, లార్జెస్ట్ ల్యాండ్ మార్క్ సృష్టికి, లార్జెస్ట్ ఫ్లేస్ ఫార్మేషన్ డ్రోన్లతో అతిపెద్ద జెండా ప్రదర్శన, ఏరియల్ లోగోల్లో ఈ రికార్డులకు సంబంధించిన సర్టిఫికేట్లను వారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందచేశారు. అంతకుముందు డ్రోన్ షోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాల శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. అమరావతి డ్రోన్ హ్యాక్‌థాన్‌లో విజేతలుగా ఎంపికైన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైజ్ మనితోపాటు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, బిసి జనార్ధనరెడ్డి, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయం



ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- పోలీసు రిక్రూట్‌మెంట్, ఆర్మీ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటు
- పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ హబ్ సెల్ ఏర్పాటు :నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధిపై నిర్వహించిన అవగాహనా సదస్సును ఎంపీ డాక్టర్ మల్లు రవితో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కుచకుళ్ల రాజేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, ఆర్థికంగా ఎలా బలపడాలి, వారి ప్రాంతాలకు ఎలాంటి పరిశ్రమలు కల్పించాలనే వాటిపై అవగాహనా సదస్సు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. దేశంలోనే మొదటిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అవగాహనా సదస్సు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు.

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని వివిధ ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో స్థానిక ఎన్జీవో సంస్థ అవార్డు సహకారంతో అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశంలోని వివిధ రకాల బ్యాంకులు అందిస్తున్న రుణాలు, సబ్సిడీలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించడానికి కావాల్సిన వనరులు, నైపుణ్యాలు, పెట్టుబడి తదితర పలు అంశాలపై వివరించారు. బ్యాంకుల చైర్మెన్‌లతో మాట్లాడి స్థానిక యువతకు బ్యాంకులు త్వరితగతిన రుణాలు అందించేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ ద్వారా జిల్లాకు ఒకటి చొప్పున ఏడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని హామీ ఇచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన యువత సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మెగా రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబెదుల్లా కొత్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా కలెక్టర్లు, మూడు జిల్లా అదనపు కలెక్టర్లు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర, జిల్లాల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు ఒకే చోట డ్యూటీ వేయాలి

- ఆయా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల నిరసన
- కుటుంబాలకు దూరమవుతున్నారని ఆందోళన
- ఖమ్మం ప్రధాన రహదారి గవిచర్ల క్రాస్ వద్ద ఆందోళన
- అడ్డుకున్న స్థానిక పోలీసులు



నవతెలంగాణ-సంగెం

మామునూర్ ఫోర్త్ బెటాలియన్ టీజీఎస్పీలో పని చేసే కానిస్టేబుళ్లకు కనీస సెలవులు ఇవ్వకుండా, కుటుంబాలకు దూరం చేస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ ఆయా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మంగళవారం వరంగల్ జిల్లా ఖమ్మం ప్రధాన రహదారి రంగశాయిపేట-గవిచర్ల క్రాస్‌రోడ్ వద్ద సుమారు 25 నుంచి 35 మంది రిజర్వుడ్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీజీఎస్పీలో పని చేసే వారికి సివిల్, ఏఆర్ లాగా ఒకే దగ్గర ఐదేండ్లు డ్యూటీ ఉండి కుటుంబాన్ని చూసుకునేలా మార్పు తేవాలని కోరారు. రిజర్వుడు పోలీసుల బాధలను అర్థం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త డీజీపీ కానిస్టేబుళ్లను కుటుంబాలకు దూరంచేసే నిర్ణయం తీసుకోవడంపై కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కాగా, నిరసన విషయం తెలుసుకున్న ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్.. నిరసన తెలుపుతున్న ప్రదేశానికి చేరుకుని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి వారిని కమాండెంట్ ఆఫీస్‌కు తరలించారు. అక్కడ వారితో ఆయన మాట్లాడినట్టు సమాచారం. ఇదిలా ఉండగా కానిస్టేబుళ్ల భార్యలు నిరసన తెలుపుతున్నారన్న విషయాన్ని గ్రహించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా ఫోర్త్ బెటాలియన్ నుంచి నిరసనకారులు ఒక్కొక్కరు ఆటోల్లో గవిచర్ల క్రాస్‌రోడ్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.

భవిష్యత్ అవసరాల మేరకు ప్రతిపాదనల్లో మార్పులు

- టీవీవీపీ హాస్పిటళ్ల పై అస్కి ప్రతిపాదనలకు మంత్రి దామోదర సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా బలోపేతం చేయడానికి అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) రూపొందించిన ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. మంగళవారం మంత్రి టీవీవీపీ హాస్పిటళ్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్పుల సమయంలో ఓపీ, ఐపీ, బెడ్ల సంఖ్యను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం ఆస్పత్రుల్లో క్లినికల్, నాన్ క్లినికల్ స్టాఫ్ పాటర్న్ ఉండాలని తెలిపారు. అదనపు పోస్టుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. సర్వీస్ మ్యాటర్, ఉద్యోగుల పదోన్నతుల్లో న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. వీవీపీని సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్‌గా మార్చడం కోసం రూపొందించిన ప్రతిపాదనలపై ఆస్కి కన్సల్టెంట్స్ మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

చాలాచోట్ల డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ టీచింగ్ హాస్పిటల్స్ కిందకు వెళ్లిపోయాయనీ, కొన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు వీవీపీ పరిధిలోకి వచ్చాయని అధికారులు మంత్రికి తెలిపారు. వీవీపీ పరిధిలోకి వచ్చిన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు అవసరమైన స్టాఫ్‌తోపాటు, ఏమేం పరికరాలు అవసరమో ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి సూచించారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్ వంటి బేసిక్ వైద్య సేవలు అన్నీ వీవీపీ హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాలన్నారు. 85 శాతం మంది రోగులకు జిల్లాల్లోనే వైద్యం అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యం అని, ఈ లక్ష్యం నెరవేరాలంటే జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు.

త్వరలో వరంగల్ హాస్పిటల్స్ పర్యటించనున్న మంత్రి

హన్మకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్, టీబీ, కంటి దవాఖానాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్షించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో రోగుల ఇక్కట్లపై ఆరా తీసిన మంత్రి, అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వాలు ఎన్నికోట్లు ఖర్చు చేసినా, అంతిమంగా ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులు, డాక్టర్లదేనన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలనీ, వాటిని పరిష్కరించే బాధ్యత తమదన్నారు. ఏయే సమస్యలు ఉన్నాయో, ఏమేం అవసరాలు ఉన్నాయో రెండ్రోజుల్లో పూర్తి వివరాలతో ప్రతిపాదనలు అందించాలని మంత్రి ఆదేశించారు. కొత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి వచ్చే వరకూ ఇప్పుడున్న హాస్పిటల్స్‌లో రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఇందుకోసం అవసరమైన రిపేర్లు చేయించాలని అధికారులకు సూచించారు. పేషెంట్ల పట్ల సానుభూతితో, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని తెలిపారు. త్వరలో స్వయంగా తానే ఎంజీఎంకు వస్తాననీ, అన్ని వార్డులు పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. కేఎంసీ పరిధిలోని 5 హాస్పిటళ్లలో1,525 బెడ్లు అందుబాటులో ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. ఇందుకు అనుగుణంగా ఏమేం కావాలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ (అకాడమిక్) శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలే లక్ష్యం

- ప్రతి పంచాయతీని సమర్థ, పారదర్శక, బాధ్యతాయుత కేంద్రంగా మారుస్తాం
- జీపీలకు 22,164 కంప్యూటర్లు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం : కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తామనీ, సమర్థవంత, పారదర్శక, బాధ్యతాయుత కేంద్రంగా ప్రతి పంచాయతీని మారుస్తామని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. పంచాయతీ సమ్మేళన్ సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో 'జీవన సౌలభ్యం.. చివరి అంచెవరకూ మెరుగైన సేవలు' అనే అంశంపై తొలి ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్వావలంబనకు, ప్రజలు స్వచ్ఛందంగా పన్ను చెల్లించేం దుకు సమర్థవంతమైన సేవలందించడం కీలకమని చెప్పారు. అప్పుడే సొంత ఆదాయ మార్గాల ద్వారా పంచాయతీలు స్వావలంబన సాధించగలుగుతాయన్నారు. సేవలు అందించడంలో ఆదర్శంగా నిలుస్తోన్న రాష్ట్రాల్లో అనుసరిస్తున్న నమూనా ప్రక్రియలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసే కృషి జరగాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకూ కంప్యూటర్లు అందుబాటులో లేని వివిధ రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీలకు 22,164 కంప్యూటర్లను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. 3,301 గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో సానుకూల మార్పును తీసుకురావాల్సిన బాధ్యత పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని నొక్కి చెప్పారు. పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులను అత్యాధునిక పరికరాలు, సాంకేతికతో సన్నద్ధం చేయడం ద్వారా క్షేత్రస్థాయి నుంచే పరిపాలనా విప్లవానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్ నగర్ మాట్లాడుతూ..ఎన్ఐసీకి చెందిన సర్వీస్‌ప్లస్, యునిసెఫ్‌కు చెందిన రాపిడ్ ప్రోతో సహా వివిధ డిజిటల్ సదుపాయాల గురించి ప్రస్తావించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా ఉపయోగించడం, సహకార అభ్యసనపై దృష్టి సారించడం వల్ల భవిష్యత్ పంచాయతీ సమ్మేళనాల్లో జరిగే ప్రాంతీయ వర్క్‌షాప్‌లకు కొత్త ప్రామాణికతను నిర్దేశించవచ్చునన్నారు. భాషిని ప్లాట్‌ఫామ్ ద్వారా హైదరాబాద్ పంచాయతీ సమ్మేళనాన్ని బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగుతో సహా పదకొండు భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని తెలిపారు. దీంతో అన్ని భాషల వారికి అవసరమైన సమాచారాన్ని సమర్థవంతంగా అందించగలుగుతామన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ.. సృజనాత్మక విధానాల పై చర్చించడం, క్షేత్రస్థాయిలో సేవలను పెంపొందించడం కోసం అనుభవాలను పంచు కోవడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రజలకు సేవలందించడంలో సవాళ్లు, అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

5 శాతం పెరిగిన గృహ విక్రయాలు

- గత మూడు నెలల్లో 8 నగరాల్లో 87,108 యూనిట్ల సేల్ : నైట్ ఫ్రాంక్ ఇండియా

న్యూఢిల్లీ: జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఎనిమిది ప్రధాన నగరాల్లో గృహాల వి క్రయాలు 5 శాతం వృద్ధిని నమోదు చేశా యి. రూ.1కోటికి పైగా ఖరీదు చేసే ప్రీమియం హౌసింగ్కు డిమాండ్ కారణంగా హౌసింగ్ విక్రయాలలో పెరుగుదల ఉంది. ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతం మినహా అన్ని మార్కెట్లలో గృహాల విక్రయాలు వృద్ధిని చూశాయి. రియల్ ఎస్టే ట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా గురువారం వెబినార్ ద్వారా 2024 క్యాలెండర్ ఇయర్ మూడో త్రైమాసికానికి తన నివేదిక 'ఇండియా రియల్ ఎస్టే ట్ నివేదికను విడుదల చేసింది. రెసిడెన్షియల్ మా ర్కెట్లో మొమెంటం 2024లో బాగా పెరిగింది. వ ర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్సును ఉద్దేశించి నైట్ ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బైజల్ మాట్లాడుతూ, రూ.1 కోటి కంటే ఎక్కువ ఖరీదు చేసే ప్రీమియం హౌసింగ్లకు డిమాండ్ కారణం గా హౌసింగ్ అమ్మకాల వృద్ధి వ చ్చింది. సవాళ్ల కారణంగా ఈ కే టగిరీలో అమ్మకాలు క్షీణించా యన్నారు. నివేదిక ప్రకారం, ఢి ల్లీ ఎన్సిఆర్ మినహా అన్ని మా ర్కెట్లలో గృహాల విక్రయాలు పెరి గాయి. ఇక్కడ అమ్మకాలు 7 శా తం వార్షికంగా తగ్గాయి. ముం బైలో అత్యధికంగా 24,222 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. పెద్ద మార్కెట్లలో బెంగళూరులో అత్యధికంగా 14,604 యూనిట్లతో 11% వృద్ధిని సాధించింది. పుణెలో గృహాల విక్రయాలు 1% పె రిగి 13,200 యూనిట్లకు చేరుకోగా, హైదరాబాద్ లో డిమాండ్ 9% పెరిగి 9,114 యూనిట్లకు చేరు కుంది. అహ్మదాబాద్లో 11% వృద్ధితో 4,578 యూనిట్లకు చేరుకోగా, కోల్కతాలో 14% వృద్ధితో 4,309 యూనిట్లకు చేరుకుంది.